సాక్షి నల్లగొండ

బుధవారం, 5, మార్చి, 2025



టెక్ ఫెస్ట్

యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం సృజన టెక్ ఫెస్ట్ నిర్వహించారు. - 8లో



11 మంది అరెస్ట్

శిశు విక్రయం కేసులో పోలీసులు

11 మందిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట డీఎస్పీ రవి తెలిపారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	(బుధవారం సా॥)	6-30
సహర్	(గురువారం ఉ॥)	5-09

న్యూస్‌రీల్

నేడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాక

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం నల్లగొండకు రానున్నారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10 గంటలకు కనగల్ చేరుకుంటారు.అక్కడ ఇటీవల నిర్మించిన పీహెచ్‌సీ, సెంటర్ ఫర్ లైఫ్ సైన్సెస్, మహీంద్రా యూనివర్సిటీల సహకారంతో చేస్తున్న గ్లకోమా పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నల్లగొండ చేరుకుని.. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ బయల్దేరి వెళతారు.

ఇసుక అక్రమంగా తరలించొద్దు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి : ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామంలో ఇసుల రీచ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని.. ప్రతి వాహన వివరాలను సేకరించి నోట్ చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారితోపాటు.. వారికి సహకరించిన వారిపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్ తదితరులున్నారు.

హ్యాండ్లూమ్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

నల్లగొండ టూటౌన్ : హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ ఏడీ ద్వారక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు చేనేత, జౌళి శాఖ కార్యాలయం 9912183164 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గిరిజన క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

నల్లగొండ : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, పాఠశాలలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎస్‌పి.రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో 40, 6లో 9, 7లో 10, 8లో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గిరిజన విద్యార్థులు.. కుటుంబ వార్షిక ఆదాయం రూ.20 లక్షలలోపు ఉండాలని ప్రతిభ ఆదారంగా 5వ తరగతిలో 20 మంది గిరిజన బాలబాలికలకు ప్రవేశాలు కల్పిస్తారని, ఆగస్టు 31, 2025 నాటికి 9 నుంచి 11 సంవత్సరాలలోపు వయసు ఉండి 4వ తరగతి చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపికను ఈ నెల 12న మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహిస్తామని.. వివరాలకు 9966394804 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీటీఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక



ఎ.వెంకులు, ప్రధాన కార్యదర్శి



బి.వెంకటేశం, అధ్యక్షుడు

నల్లగొండ : డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా కమిటీని మంగళవారం నల్లగొండలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.వెంకటేశం, ఉపాధ్యక్షులుగా పి.ఏడుకొండలు, ఎం.పుష్పలత, ఎస్.గోపి, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకులు, కార్యదర్శులుగా ఎం.నాగయ్య, టి.వెంకటేశ్వర్లు, వై.మోహన్‌రావు, ఇ.జగతి, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం.సోమయ్య, కె.రాహెల్ కుమారి, ఇ.అంజయ్య, ఎండీ. ఖుర్షిద్‌మియా ఎన్నికయ్యారు.

వటపత్రశాయికి వరహాల లాలీ..

- రాత్రి హంస వాహనంపై ఊరేగిన శ్రీస్వామివారు
- నాల్గవ రోజుకు చేరిన యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన మంగళవారం ఉదయం శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు తిరు, మాడ వీధుల్లో వటపత్రశాయి అలంకారసేవలో ఊరేగించారు. వేకువజామున నిత్యారాధనలు చేపట్టిన తరువాత, పారాయణీకులు వేద పారాయణం పఠించారు. అనంతరం శ్రీస్వామి వారిని వటపత్రశాయి అలంకరణలో ప్రత్యేక పల్లకిపై అధిష్ఠించి ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగించారు. వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సాయంకాలం వేళ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించారు. అనంతరం శ్రీనృసింహస్వామి వారిని హంస వాహన సేవలో అలంకరించి ఊరేగించారు. దక్షిణ దిశలోని ప్రథమ ప్రాకారం నుంచి ప్రారంభమైన అలంకార సేవ పడమటి రాజగోపురం నుంచి ఉత్తరం, తూర్పు, దక్షిణ రాజగోపురాల ముందు నుంచి సాగింది.

ఆలయంలో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో శ్రీస్వామి వారిని బుధవారం ఉదయం శ్రీకృష్ణాలంకారణ (మురళీ కృష్ణుడు) సేవ చేపట్టనున్నారు. సాయంత్రం పొన్నవాహన సేవ నిర్వహించనున్నారు.



హంస వాహన సేవలో నృసింహస్వామి



వటపత్రశాయి అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు

ఓటరునాడి పట్టలే..!

- సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన టీఎస్ యూటీఎఫ్
- పాత స్థానాన్ని దక్కించుకున్న పీఆర్‌టీయూ–టీఎస్
- సొంత నియోజకవర్గం కాకున్నా గట్టి పోటీ ఇచ్చిన హర్షవర్ధన్ రెడ్డి
- టీచర్లలో బలాన్ని పెంచుకోలేకపోయిన బీజేపీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ– టీఎస్ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందగా, టీఎస్ యూటీఎఫ్ తమ సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. సంఘం పోరాట పటిమ తమ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపిస్తుందన్న నమ్మకంతో ఉన్నా.. అనుకూల ఫలితాన్ని సాధించలేకపోయింది. ఇక పీఆర్‌టీయూ–టీఎస్ గతంలో కోల్పోయిన తమ స్థానాన్ని ఈసారి దక్కించుకోగలిగింది. ఉపాధ్యాయుల్లో పెద్ద సంఘంగా పేర్కొనే పీఆర్‌టీయూ ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించుకొని తమ పాత స్థానాన్ని పదిలం చేసుకోగలిగింది. సొంత నియోజకవర్గం కాకపోయినా ఈ ఎన్నికల్లో బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి గట్టిగా పోరాడి ఓడారు. బీసీ నినాదంతో ఈ ఎన్నికల్లో బరిలోకి దిగిన పూల రవీందర్ ఆశించిన ఫలితం రాబట్టలేకపోయారు. ఇక, బీజేపీ అనుకున్నంత స్థాయిలో తమ బలాన్ని టీచర్లలో పెంచుకోలేకపోయింది. దీంతో ఆ పార్టీ తరఫున బరిలో దిగిన పులి సరోత్తంరెడ్డికి ఆశాభంగం తప్పలేదు.



ఎమ్మెల్సీ ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఎక్కడ పొరపాటు జరిగింది..

ఈ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ రెండో స్థానానికి పడిపోవడంపై ఆ యూనియన్ ఆలోచనల్లో పడింది. గెలుస్తామని ధీమాతో ఉన్నా అంచనాలు ఎక్కడ తారుమారయ్యాయి.. ఓటమికి కారణాలేంటనే విశ్లేషణ చేసుకుంటోంది. 2019 ఎన్నికలో గెలుపొందిన తాము ఈసారి ఎందుకు ఓడిపోయామనే చర్చ యూటీఎఫ్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. యూనియన్‌కు ఉన్న సంప్రదాయ ఓట్లు అలాగే ఉన్నాయని, అవి తమ అభ్యర్థికే పడ్డాయని, అయితే తటస్థంగా ఉండే టీచర్ల ఓట్లు మాత్రం హర్షవర్ధన్‌రెడ్డికి వేశారని అంచనా వేస్తోంది. హర్షవర్ధన్ పోటీలో ఉండటం వల్లే తమకు రావాల్సిన ఓట్లకు గండిపడి, రెండోస్థానానికి పడిపోవాల్సి వచ్చిందని భావిస్తోంది. డబ్బు, మద్యం పంపిణీ ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో పని చేసిందన్న విశ్లేషణ యూటీఎఫ్ వర్గాల్లో సాగుతోంది.

ఇద్దరికి ప్రచారం చేయడమే దెబ్బకొట్టిందా?

ఈ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అనుకున్న మేర ప్రభావం చూపలేకపోయారు. బీసీ వాదంతో, బీసీ సంఘాల మద్దతులో బరిలోకి దిగినా, అది పూర్తిగా ఫలించ లేదు. ముఖ్యంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఒకే ఎన్నికలో ఇద్దరు బీసీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని చెప్పడం మైనస్‌గా మారిందనే చర్చ సాగుతోంది. ఎవరో ఒకరిని గెలిపించాలని కోరితే ఆ ఒక్కరికి ఓట్లు పడేవని, రవీందర్‌తోపాటు సుందర్‌రాజుకు ఓట్లు వేయాలని సూచించడంతో బీసీ ఓట్లు చీలిపోయాయన్న చర్చ సాగుతోంది.

గట్టి పోటీ ఇచ్చిన హర్షవర్ధన్‌రెడ్డి..

ఉపాధ్యాయ ఎన్నికల్లో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి టీచర్స్ జేఏసీలోని సంఘాల మద్దతులో బరిలో దిగి చివరి వరకు పోరాడారు. ఓడిపోయినా.. గణనీయమైన ఓట్ల సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సాన్నిహిత్యం వల్ల పండిట్, పీఈటీ పదోన్నతులు, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇప్పించడం వంటి విధాన నిర్ణయాల్లో హర్షవర్ధన్‌రెడ్డి కీలక ప్రాత పోషించిన అంశం టీచర్లలోకి బలంగానే వెళ్లింది. హర్షవర్ధన్ స్థానికేతరుడనే ప్రత్యర్థుల ప్రచారం కూడా ఆయనకు ప్రతికూలంగా మారింది. అయినప్పటికీ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి, హర్షవర్ధన్ మధ్య వ్యత్యాసం 500లోపు ఓట్లు మాత్రమే ఉండడం గమనార్హం. పూల రవీందర్ ఎలిమినేట్ కావడానికి ముందు 16వ రౌండ్ ముగిసే వరకు నర్సిరెడ్డికి 5,660 ఓట్లు ఉండగా, హర్షవర్ధన్‌రెడ్డికి 5,309, శ్రీపాల్‌రెడ్డికి 7,673 ఓట్లు ఉన్నాయి. నర్సిరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి మధ్య వ్యత్యాసం 351 ఓట్లే. రవీందర్ ఎలిమినేషన్ తరువాత కూడా అదే పరిస్థితి కొనసాగింది. దీంతో హర్షవర్ధన్‌రెడ్డి మూడో స్థానానికి వెళ్లాల్సి వచ్చింది.

ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- గంట ముందు నుంచే పరీక్ష కేంద్రంలోకి..
- కేంద్రాల్లో అరకొర వసతులు

నల్లగొండ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష సమయానికి గంట ముందు నుంచే విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించనున్నారు. అయితే ఈ సారి అధికారులు నిమిషం నిబంధన ఎత్తివేశారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతించనున్నారు.

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఇలా..	
ఫస్టియర్	13,992
సెకండియర్	14,730
మొత్తం	28,722
పరీక్ష కేంద్రాలు	52

సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణ..

ఇంటర్ పరీక్షల నిర్వహణను సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించనున్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. దీంతో హైదరాబాద్‌లో ఉండే పరీక్షల నిర్వహణ తీరును అధికారులు పర్యవేక్షించనున్నారు. హాల్ టికెట్‌పై ఈసారి క్యూఆర్ కోడ్ ముద్రించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ విద్యార్థి పరీక్ష కేంద్రం చిరునామా తెలుస్తుంది.

అరకొర సౌకర్యాలు..

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో అరకొర సౌకర్యాలే ఉన్నాయి. కొన్నిచోట్ల ఫ్యాన్లు, లైట్లు లేవు. ఎండల తీవ్రత పెరగడంతో విద్యార్థులు ఉక్కపోతతో పరీక్షలు రాయాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కాలేజీలో భవనం బాగుంది కానీ.. కొన్ని గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు లేవు. స్విచ్ బోర్డులు కూడా లేవు.



కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈఓ దస్రూనాయక్, అధికారులు

పరీక్షలు సవ్యంగా నిర్వహించాలి : కలెక్టర్

ఇంటర్మీడియట్ పరీక్షలు సవ్యంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధించాలని సూచించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ

నల్లగొండ : ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందు ప్రధాన గేటు వద్ద తనిఖీలు నిర్వహించే సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి



కొండమల్లేపల్లి ఎస్సీ గురుకులంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకొని.. వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకాంక్షించారు. మంగళవారం కొండమల్లేపల్లి ఎస్సీ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, స్టోర్ రూం, కూరగాయలు, బియ్యం నిల్వ ఉంచే స్థలాలను, తరగతి గదులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంపై ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. అనంతరం కలెక్టర్ 8వ తరగతి ఏ సెక్షన్‌కు వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, ఇంగ్లిష్, మ్యాథ్స్‌తో పాటు పలు సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. తర్వాత విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ శౌరీలు, ఎంపీడీఓ బాలరాజురెడ్డి తదితరులున్నారు.

నీట్ ప్రవేశ పరీక్షకేంద్రాల పరిశీలన

నల్లగొండ : మే 4వ తేదీన నిర్వహించనున్న నీట్ ప్రవేశపరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో అవసరమైన టేబుళ్లు, వెంటిలేషన్, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. నల్లగొండలోని ఎస్పీఆర్, నారాయణ, అరబిందో తదితర పాఠశాలలను పరిశీలించాలని ఆర్డీఓను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, నీట్ పరీక్షల లైజనింగ్ ఆఫీసర్ పార్థసారధి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తొద్దు

కేతేపల్లి : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎస్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కేతేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాలు అందని ప్రాంతాలను గుర్తించి, తాగునీరు అందేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రైవేట్ బోర్లు అద్దెకు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పనులకు ప్రతి గ్రామంలో వంద మందికి పైగా కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. వన నర్సరీలో మొక్కలకు ప్రతి రోజు రెండుసార్లు నీళ్లు అందించటంతో పాటు ఎండ వేడిమి నుండి సంరక్షించేందుకు షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సాయికుమార్, వాటర్‌గ్రిడ్ ఏఈ అశోక్, ఈజీఎస్ ఏపీఓ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కేంద్రానికి అశాస్త్రీయ డీపీఆర్ పంపారు

- రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

చౌటుప్పల్ : రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్రానికి అశాస్త్రీయంగా పంపించిందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాలకు చెందిన ట్రిపుల్‌ఆర్ భూనిర్వాసితులు మంగళవారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డితో సమావేశమయ్యారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్‌ను కలిశారు. ఎలాగైనా నిబంధనల ప్రకారం 40కిలోమీటర్ల దూరం నుంచి అలైన్‌మెంట్ మార్పించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తప్పులతో కూడిన డీపీఆర్‌కు కేంద్రం ఏ విధంగా ఆమోదం తెలుపుతుందని ప్రశ్నించారు. తక్షణమే ఉత్తర భాగంలో శాస్త్రీయంగా డీపీఆర్ తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్, భూనిర్వాసితుల ఐక్యవేదిక కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, నిర్వాసితులు గుజ్జుల సురేందర్ రెడ్డి, మారుపాక రామలింగం, జాల వెంకటేష్, దబ్బేటి రాములు, బోరెం ప్రకాష్‌రెడ్డి, సందగళ్ల మల్లేష్, జాల శ్రీశైలం, నర్సింహ, గుండెబోయిన వేణు, బలికే మధు, నాగవెల్లి దశరథ, జనార్దన్‌రెడ్డి, సుధాకర్, వల్లూరి బోవయ్య, శ్రీశైలం, జోసెఫ్, బాలమల్లయ్య, కార్తీక్, మల్లేష్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ కాలేజీలో యూత్ పార్లమెంట్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ఎన్జీ కాలేజీలో ఈనెల 12, 13 తేదీల్లో యూత్ పార్లమెంట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. మంగళవారం యూత్‌పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా యువకులు పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం కల్పిస్తూ ఎన్జీ కాలేజీలో రెండు రోజుల పాటు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంజీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.మద్దిలేటి మాట్లాడుతూ నల్లగొండ, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు నోడల్ కళాశాలగా ఎన్జీ కాలేజీని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మూడు జిల్లాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులు ×వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ₹ అనే అంశంపై ఒక్క నిమిషం వీడియో తీసి మై భారత్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి ఫిబ్రవరి 25 నుంచి మార్చి 9వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 150 మందిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారని చెప్పారు. పోటీల అనంతరం పది మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర యూత్ ఆఫీసర్ బి.ప్రవీణ్ సింగ్, ప్రోగ్రాం ఆర్గనైజర్ కొండానాయక్, ప్రెస్ కన్వీనర్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఎం.వెంకట్‌రెడ్డి, ఎస్.కోటయ్య, ఏ.మల్లేశం, ఎం.సావిత్రి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

సెర్ప్‌లో.. మెప్మా విలీనం!

- ప్రతిపాదనలు రూపొందించిన ప్రభుత్వం
- మున్సిపాలిటీల్లోని ఉద్యోగులు డీఆర్‌డీఏ పరిధిలోకి..

నల్లగొండ టూటౌన్ : పట్టణ ప్రాంతాల్లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మెప్మా.. ఇక నుంచి డీఆర్‌డీఏలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడగానే.. జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, నందికొండ, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల్లోని మెప్మా ఉద్యోగులు, సిబ్బందితో పాటు జిల్లా కేంద్రంలోని మెప్మా జిల్లా కార్యాలయం ఉద్యోగులు అందరూ సెర్ప్ పరిధిలోకి వెళ్లనున్నారు.



మెప్మా కార్యాలయం

కమిషనర్ల ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది విధులు

మున్సిపాలిటీల్లో మహిళలను గ్రూప్‌లుగా ఏర్పాటు చేసే మెప్మా ఉద్యోగులు జిల్లాలో 18 మంది వరకు ఉన్నారు. అదే విధంగా వార్డుల్లో క్షేత్రస్థాయిలో పని చేసే మెప్మా రిసోర్స్ పర్సన్లు 130 మంది వరకు ఉన్నారు. వీరంతా మున్సిపాలిటీ కమిషనర్ల ఆధ్వర్యంలో పని చేస్తున్నారు. వీరు మహిళా సంఘాలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించడంతో పాటు నెల నెలా తిరిగి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటారు. ఇక.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పనిని సెర్ప్ కార్యాలయం కింద పనిచేసే ఉద్యోగులు పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు శాఖలను విలీనం చేస్తే మెప్మా ఉద్యోగులు సెర్ప్ కార్యాలయంలో విధులు నిర్వర్తించనున్నారు.

పట్టణాల్లో సర్వేలకు ఇబ్బందే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు, ఇతరత్రా పనులను క్షేత్రస్థాయిలో మెప్మా ఆర్పీలు, ప్మా సీఓలు సర్వే చేస్తుంటారు. మెప్మా ఆర్పీలకు కాలనీల్లో ఉండే వివరాలు తేలికగా తెలిసే అవకాశం ఉంటుందని.. ప్రతి సర్వేకు వారి సేవలను వినియోగించుకున్నారు. ఇక నుంచి వారు ఇతర శాఖ పరిధిలోకి వెళ్తే.. మున్సిపాలిటీ సేవలకు వారు వచ్చే అవకాశం ఉండకపోవచ్చు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ప్రభుత్వం చేపట్టే సర్వే చేయాలంటే ఇక నుంచి మున్సిపల్ యంత్రాంగానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

క్లుప్తంగా

మానసిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

కోదాడరూరల్: మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీమన్నారాయణ కాలనీలో నివాసముంటున్న వేముల బాలరాజు(32) తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మానసిక సమస్యలతో బాధపడుతున్న అతడు సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మంగళవారం మృతుడి భార్య తిరపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి హామీ పనికి వెళ్లి గుండెపోటుతో మృతి


మహేష్ (ఫైల్)

మోతె: ఉపాధి హామీ పనికి వెళ్లిన యువకుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన మోతె మండలం కూడలి గ్రామంలో మంగళవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కూడలి గ్రామానికి చెందిన నిమ్మరబోయిన మహేష్(32) రోజుమాదిరిగానే మంగళవారం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఛాతి వద్ద నొప్పి వస్తుందని ఇంటికి వెళ్లాడు. అనంతరం కొద్దిసేపటి తర్వాత వాంతులు చేసుకోవడంతో స్థానిక వైద్యుడి వద్దకు వెళ్లే లోపే గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య సంధ్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి


జానయ్య (ఫైల్)

వేములపల్లి: కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన మంగళవారం వేములపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన పుట్టల జానయ్య(84) మంగళవారం ఉదయం వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు జానయ్యను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జానయ్యను స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. వ్యక్తి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

వలిగొండ: బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ టన వలిగొండ మండలం నాగారం సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం అరూరుకు చెందిన బోగారం వెంకటయ్య (60), బోగారం రాందాసు కలిసి బైక్‌పై అరూరు నుంచి గొల్నెపల్లికి వెళ్తుండగా.. నాగారం గ్రామ సమీపంలో టిప్పర్ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న యాదయ్య రోడ్డుపై పడడంతో టిప్పర్ అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాందాసుకు గాయాలయ్యాయి. టిప్పర్ డ్రైవర్ పల్లపు శ్రీశైలంను పోలీసులు అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీసే టెక్ ఫెస్ట్

- యాదగిరిగుట్ట, నల్లగొండ, తిరుమలగిరి పాలిటెక్నిక్ కళాశాలల్లో ఎగ్జిబిట్లు ప్రదర్శించిన వేర్వేరు బ్రాంచ్‌ల విద్యార్థులు

యాదగిరిగుట్ట/యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం 2024–25 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో సృజన టెక్ ఫెస్ట్ నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, నాగార్జునసాగర్, యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. ఆయా కళాశాలల విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లను యాదాద్రి భువనగిరి జిల్లా ఎలక్ట్రికల్ డీఈ వెంకటేశ్వర్లు, హైదరాబాద్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. మానిక, యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి. వెంకటేశ్వర్లు పరిశీలించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ టెక్ ఫెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ టెక్ ఫెస్ట్‌లో నాగార్జున సాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు


తిరుమలగిరి పాలిటెక్నిక్ కళాశాలలో ఎగ్జిబిట్‌ను వివరిస్తున్న విద్యార్థులు


నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టెక్ ఫెస్ట్‌లో ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆటో వోల్ట్ క్రూయిజ్, నల్లగొండ కళాశాల విద్యార్థులు డిజైన్ ఆఫ్ ఆన్ ఆటోమెటికల్ రిచార్డ్ పవర్ యూనిట్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికిల్, యాదగిరిగుట్ట విద్యార్థులు వాయిస్ కంట్రోల్ వీల్ చైర్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో నల్లగొండకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన డిజైన్ ఆఫ్ ఆన్ ఆటోమెటికల్ రిచార్డ్ పవర్ యూనిట్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికిల్ ప్రాజెక్టుని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్, రాజగోపాల్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి రామానాయుడు, జనరల్ సెక్షన్ సీనియర్ స్టాఫ్ సాయిరాం, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ..

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన టెక్ ఫెస్ట్‌లో నల్లగొండ, సూర్యాపేట, తిరుమలగిరి, నాగార్జునసాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సివిల్, కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌ల విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. సివిల్ విభాగంలో సూర్యాపేట మహిళా పాలిటెక్నిక్ ప్రథమ స్థానం, నాగార్జునసాగర్ పాలిటెక్నిక్ కళాశాల ద్వితీయ స్థానం, కంప్యూటర్ సైన్స్ విభాగంలో నల్లగొండ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రథమ స్థానం, సూర్యాపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. నర్సింహారావు, సివిల్ విభాగం జిల్లా కోఆర్డినేటర్ విజయ శారద, కంప్యూటర్ సైన్స్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీమాధురి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ బ్రాంచ్‌కు..

తిరుమలగిరి: తిరుమలగిరి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సృజన టెక్ ఫెస్ట్‌లో నల్లగొండ, యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి మెకానికల్ బ్రాంచ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో యాదగిరిగుట్ట మెకానిక్ బ్రాంచ్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వై. సత్తయ్య, జిల్లా కోఆర్డినేటర్ జి. చరణ్, చంద్రకళ, వినోద్‌కుమార్, శివప్రసాద్, పురుషోత్తం, లింగస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజైన్ ఆఫ్ ఆన్ ఆటోమెటికల్ రిచార్డ్ పవర్ యూనిట్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికిల్


ప్రాజెక్టును వివరిస్తున్న నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు డిజైన్ ఆఫ్ ఆన్ ఆటోమెటికల్ రిచార్డ్ పవర్ యూనిట్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికిల్ ప్రాజెక్టును ప్రదర్శించారు. ఎలక్ట్రిక్ వాహనాల్లో చార్జింగ్ అయిపోతే సోలార్ వాహనంలో ఆటోమెటికల్ రిచార్డ్ పవర్‌ను తీసుకుని వాహనాన్ని ఎలా నడపాలో అనే అంశంపై ఈ ప్రాజెక్టును విద్యార్థులు రూపొందించారు. ఈ ప్రాజెక్టును రూపొందించడానికి రూ.4,500 ఖర్చు కాగా, ఇందులో సోలార్, డైనమో, చార్జింగ్, బ్లూటూత్, ఇండికేటర్, ఆర్డినో, మార్ట్ ల్యాబ్ వంటి పరికరాలను వాడినట్లు విద్యార్థులు తెలిపారు. ఏదైనా ప్రదేశంలో వాహనం చార్జింగ్ లేక ఆగిపోతే ఈ సోలార్ పవర్ రీచార్జ్ ద్వారా ఆ వాహనంలో పవర్ జనరేట్ అవుతుందని విద్యార్థులు తెలియజేశారు.

ఆటో వోల్ట్ క్రూయిజ్


ఆటో వోల్ట్ క్రూయిజ్ ప్రాజెక్టుతో సాగర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

నాగార్జునసాగర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆటో వోల్ట్ క్రూయిజ్ అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. సైకిల్ రూపంలో ఉన్న ఒక ఎలక్ట్రిక్ వాహనాన్ని వీరు రూపొందించారు. ఈ వాహనం 3–4 గంటలు చార్జింగ్ పెడితే 30 కిలోమీటర్లు ప్రయాణం సాగించవచ్చు. ఈ వాహనంలో చార్జింగ్ అయిపోతే పెడల్ ద్వారా ముందుకు సాగితే సైకిల్ వాహనం మళ్లీ చార్జ్ అవుతుంది. ఈ వాహనం తయారు చేయడం కోసం రూ.25,000 ఖర్చు చేశారు. ఇందులో ఈవీ మోడల్ డైనమో, మెకానికల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ ఎనర్జీగా మారి చార్జ్ కంట్రోల్‌కి వెళ్లి బూస్టర్ సర్క్యూలర్ ద్వారా బ్యాటరీ రీచార్జ్ అవుతుంది.

వాయిస్ కంట్రోల్ వీల్‌చైర్


వాయిస్ కంట్రోలర్ వీల్‌చైర్ ప్రాజెక్టుతో యాదగిరిగుట్ట పాలిటెక్నిక్ కళాశాల

యాదగిరిగుట్టకు పాలిటెక్నిక్ విద్యార్థులు వాయిస్ కంట్రోల్ వీల్‌చైర్ ప్రాజెక్టును ప్రదర్శించారు. దివ్యాంగులు ఆస్పత్రికి వెళ్లాలంటే వారిని ఇంకొకరు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా వాయిస్ కంట్రోల్‌తో వీల్‌చైర్ కదిలే విధంగా ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టుకు రూ.5,000 ఖర్చు కాగా, బ్యాటరీ, ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ, డీసీ మోటర్, ఆర్డినో, సాఫ్ట్‌వేర్ బ్యాటరీ పరికరాలు వాడారు.

శిశువు విక్రయం కేసులో 11 మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్: శిశువును విక్రయించిన కేసులో 11 మందిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట డీఎస్పీ రవి తెలిపారు. మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సూర్యాపేట మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఇంద్రకంటి సతీష్, స్వప్న దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. ముగ్గురిని సాకే స్థోమత లేక మూడో కుమారుడు పుట్టిన తర్వాత రెండు నెలలకు అతడిని హైదరాబాద్‌లోని ఉప్పుగూడకు చెందిన ఆవుల సురేందర్, భాగ్యవతి దంపతులకు విక్రయించారు. శిశువుని ఇచ్చినందుకు గాను సతీష్, స్వప్న దంపతులకు ఆవుల సురేందర్, భాగ్యవతి దంపతులు రూ.4.5లక్షలు ఇచ్చారు. విక్రయించిన బాబు వయస్సు ప్రస్తుతం 18 నెలలు. ఈ విషయం తెలుసుకున్న సూర్యాపేట మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన రమావత్ జ్యోతి ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేసింది. బాలుడిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించాలని 10 రోజుల గడువు ఇవ్వగా గడువు లోపు అప్పగించకపోవడంతో ఐసీడీఎస్ అధికారులు సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన సూర్యాపేట రూరల్ పోలీసులు విచారణ చేపట్టి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం పోలీసులు బాలుడిని సూర్యాపేట ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఈ కేసులో ఇంద్రకంటి సతీష్, ఇంద్రకంటి స్వప్న, సోముల జంగయ్య, నెమ్మది శ్రీరాములు, గడ్డపాటి నాగరాజు, సోమపంగు రాధాకృష్ణ, ఆవుల సురేందర్, భాగ్యవతి, మంచాల రేణుకతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4.50లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ బాలునాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

16 గోవుల పట్టివేత


పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన గోవులు

కొండమల్లేపల్లి: మినీ డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న 16 గోవులను కొండమల్లేపల్లి మండలం చెన్నారం గేటు వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. గోవులను తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. 16 గోవులను నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని గురునానక్ గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

- అతడి ఇద్దరు భార్యలకు గాయాలు

చందంపేట: రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా.. అతడి ఇద్దరు భార్యలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చందంపేట మండలం పోలేపల్లి బిల్డింగ్‌తండా వద్ద సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. చందంపేట మండలం మానావత్‌తండాకు చెందిన రమావత్ పాండు (50) తన ఇద్దరు భార్యలతో కలిసి దేవరకొండ నుంచి తన స్వగ్రామమైన మానావత్‌తండాకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో పోలేపల్లి నుంచి దేవరకొండ వైపు జీపు వస్తుంది. ఈ క్రమంలో మానా వత్‌తండా వైపు రోడ్డు దాటుతున్న వీరి బైక్‌ను జీపు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాండు అక్కడికక్కడే మృతిచెందగా.. ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

మఠంపల్లి: మండలంలోని బకమంతులగూడెం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన నందిగామ నరేంద్ర (24) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేంద్ర బైక్‌పై హుజూర్‌నగర్ నుంచి మైహోం సిమెంట్ పరిశ్రమకు వెళ్తుండగా.. మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరేంద్ర తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యాదగిరీశుడికి పట్టువస్త్రాలు బహూకరణ


ఈఓ భాస్కర్‌రావుకు పట్టువస్త్రాలు అందజేస్తున్న చాట్లా లక్ష్మీకాంత్-అశ్విని దంపతులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన చాట్లా వెంకటేష్-పుష్ప దంపతులు, చాట్లా లక్ష్మీకాంత్-అశ్విని దంపతులు సుమారు రూ.3లక్షల విలువ చేసే పట్టు వస్త్రాలను మంగళవారం ఈఓ భాస్కర్‌రావుకు అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ వేడుకలో ఈ పట్టువస్త్రాలను వినియోగించాలని చాట్లా లక్ష్మీకాంత్-అశ్విని దంపతులు ఈఓను కోరారు. గత పదేళ్లుగా బ్రహ్మోత్సవాలు, జయంతి ఉత్సవాలకు పట్టువస్త్రాలను ఇస్తున్నామన్నారు. త్వరలోనే సోలాపూర్‌లో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని సైతం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, టీటీడీ లోకల్ అడ్వైజరీ మాజీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్, రాజలింగం, రవి తదితరులున్నారు.

సంప్రదాయ నృత్యాలు.. భక్తి సంగీతం


యాదగిరిగుట్ట ఆలయ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

- యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు


భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్న సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ బృందం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం ఉదయం రాయగిరి శ్రీరామ భక్త భజన మండలి, రామంతాపూర్ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యం, వైదిక ప్రార్థన కొనసాగింది. హైదరాబాద్‌కు చెందిన విజయకుమారాచార్య స్వామిచే నృసింహ అవతార వైభవం, వాహన సేవల ప్రవచన ఉపన్యాసం భక్తులను ఆకర్షించింది. ఏపీలోని ఒంగోలుకు చెందిన వేదవతి భాగవతారిణిచే సీతారామ కల్యాణ హరికథ నిర్వహించారు. అనంతరం భువనగిరికి చెందిన సిరి కూచిపూడి నృత్యాలయం కళాకారులు కూచిపూడి నృత్యాలతో అందరికి అలరింపజేశారు. వేములవాడకు చెందిన సీహెచ్ రఘునందన్ భక్తి సంగీతం నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, ఆయన బృందంచే భక్తి సంగీత విభావరి అద్భుతంగా కొనసాగింది.

గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ

- భయాందోళనకు గురైన కోదాడలోని ఆజాద్‌నగర్ వాసులు

కోదాడ: తాగునీటి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేసేందుకు మున్సిపల్ సిబ్బంది తవ్వుతుండగా గ్యాస్ పైప్‌లైన్ లీకైంది. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని ఆజాద్‌నగర్‌లో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆజాద్ నగర్‌లో ఇటీవల అండర్ గ్రౌండ్ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ విషయంపై అవగాహన లేని కోదాడ మున్సిపాలిటీ వాటర్ సప్లై సిబ్బంది ఆజాద్‌నగర్ బాలికల పాఠశాల వద్ద తాగునీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీ అవుతుందని మంగళవారం ఉదయం తవ్వసాగారు. ఈ క్రమంలో గ్యాస్ పైప్‌లైన్‌కు గుణపం తగిలి పెద్ద శబ్దంతో గ్యాస్ లీకైంది. ఈ శబ్దానికి పాఠశాలలోని బాలికలు, ఉపాధ్యాయులు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు కూడా భయంతో అధికారులకు ఫిర్యాదు చేయడంతో గ్యాస్ సప్లై ఆపివేశారు. గ్యాస్ కంపెనీ ప్రతినిధులు వచ్చి వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. కోదాడ పట్టణంలో అండర్ గ్రౌండ్ గ్యాస్ పైప్‌లైన్ ఉన్నందున రోడ్ల వెంట తవ్వకాలు జరిపేవారు తమకు తప్పకుండా సమాచారం ఇవ్వాలని గ్యాస్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, రోడ్డు రోలర్ ఢీ

- ముగ్గురు ప్రయాణికులకు గాయాలు

సూర్యాపేటటౌన్: పల్లె వెలుగు బస్సు, రోడ్డు రోలర్ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న పల్లె వెలుగు బస్సు ఎదురుగా వస్తున్న రోడ్డు రోలర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సు టైరు పేలడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో ముందు అద్దం పూర్తిగా ధ్వంసమైంది. బస్సులో ముందు సీట్లలో కూర్చున్న ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో 60మంది ప్రయాణికులు ఉండగా మిగతా వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన వారిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాంగ్ రూట్‌లో రోడ్డు రోలర్ ఎదురుగా రావడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో గల కేశవనగర్ కాలనీకి చెందిన ధీరావత్ సోని ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ పిల్లి లోకేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ధీరావత్ సోని పరిసర గ్రామాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి ఎక్కువ ధరకు అమ్ముతుందని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు సోనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమెపై గతంలోనూ పలు కేసులున్నాయని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇంట్లో జారిపడి వ్యక్తి మృతి

చిట్యాల: ఇంట్లో జారిపడి తలకు తీవ్ర గాయాలై వ్యక్తి మృతిచెందాడు. చిట్యాల ఎస్‌ఐ ఎస్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన మాదరబోయిన ముత్యాలు(54) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు. అతని భార్య లక్ష్మి మంగళవారం కూలీ పనులకు వెళ్లగా.. ముత్యాలు ఇంట్లో ఒంటరిగానే ఉన్నాడు. ఈ క్రమంలో అతడు ఇంట్లో జారిపడడంతో తలకు తీవ్ర గాయమై మృతిచెందాడు. పక్కింటి వ్యక్తి గుర్తించి ముత్యాలు భార్య లక్ష్మికి సమాచారం అందించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వలిగొండ: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వలిగొండ మండలం నాగారం గ్రామానికి చెందిన మైసోళ్ల సత్తయ్య ఆదివారం ఇంటికి తాళాలు వేసి బంధువులను పరామర్శించేందుకు వెళ్లారు. మంగళవారం సాయంత్రం సత్తయ్య ఇంటి తలుపులు తీసి ఉండటం గమనించిన గ్రామస్తులు ఆయనకు సమాచారం ఇచ్చారు. సత్తయ్య ఇంటికి వచ్చి చూడగా.. బీరువాలో దాచిన రూ.లక్ష నగదు, తులం బంగారం, 40 తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించాడు. పోలీసులు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం సహాయంతో వచ్చి వేలిముద్రలు సేకరించారు. పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

- ఎండిన వరి.. పశువులకు మేతగా మారి..


నాంపల్లి: బోజగూడెంలో భూగర్భజలాలు అడుగంటడంతో ఎండిపోయిన తన వరి పొలంలో పశువులను మేపుతున్న రైతు


రామన్నపేట: వెల్లంకి గ్రామ పరిధిలో..


ఆత్మకూర్ (ఎస్): ఏపూరు గ్రామంలో ఎండిపోయిన వరి చేనులో గొర్రెలను మేపుతున్న రైతు